క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధికి నగదు వితరణ



ఆర్థికసాయం అందజేస్తున్న ప్రసాదరావు

పాల్వంచ: తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి నగదు వితరణగా అందజేశాడు. పట్టణంలోని సీతారాంపట్నం ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి బూరుగుపల్లి ప్రసాదరావు గురువారం రూ.20వేల చెక్కును హెచ్ఎం సుదా శ్రీనుకు అందించారు. అదే విధంగా మరో రూ.20వేలతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస రెడ్డి, నల్లమల్ల సత్యనారాయణ, నరసింహారావు, సుధాకర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓగా కృష్ణయ్య బాధ్యతల స్వీకరణ



కృష్ణయ్య

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఎంఈఓగా కృష్ణయ్య గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు కృష్ణయ్య ఇల్లెందు ఎంఈఓగా, గుండాల, ఆళ్లపల్లి మండలాలకు కూడా ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలు కొనసాగించనున్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయ సమావేశ హాల్‌లో మెప్మా ఆర్‌పీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వర్షకాలం నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ, తడి, పొడి చెత్తను వేరు చేసి ఇళ్ల ముందుకు వచ్చే మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి అందజేయాలన్నారు. ఆర్‌పీలు వారి వార్డుల్లోని ప్రజలకు అవగాహన కల్పించి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మెప్మా అధికారులు, సిబ్బంది, ఆర్‌పిలు, శానిటేషన్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీటు



సాయికుమార్

టేకులపల్లి: మండలంలోని నంద్యాతండాకు చెందిన పేద విద్యార్థి ఇస్లావత్ సాయికుమార్ భాగల్‌పూర్‌లో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. ఈ మేరకు సాయి కుమార్‌ను గ్రామపెద్దలు అభినందించారు.

నేడు 'చలో కలెక్టరేట్'

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థుల హక్కుల సాధన, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని శుక్రవారం నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బి.అభిమన్యు, ప్రధాన కార్యదర్శి వీరభద్రం పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య పరిష్కరించకపోతే మంత్రుల ఇండ్లు ముట్టడిస్తామని, జిల్లాలో తిరగనివ్వమని అడుగడుగున అడ్డుకుంటామన్నారు. రేపటి చలో కలెక్టరేట్‌కు ప్రభుత్వ, ప్రవేట్ విద్యాసంస్థలు యాజమాన్యాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ప్రాధాన్యత కల్పించాలి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 35 చైర్మన్ పోస్టుల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ముస్లింలకు స్థానం దక్కలేదని, ముస్లింలకు తగిన న్యాయం చేయాలని మైనారిటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ గెలుపునకు ముస్లింలు ఏకపక్షంగా ఓటేశారన్నారు. సీఎం స్పందించి ఉమ్మడి జిల్లాలో ముస్లిం వర్గానికి ఒక కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఆటోవర్కర్ల యూనియన్ కమిటీ ఎన్నిక

జూలూరుపాడు: ఆటోవర్కర్ల యూనియన్ (ఏఐటీయూసీ) చంద్రుగొండ ఆటో అడ్డా నూతన కమిటీ ఎన్నిక గురువారం మండల కేంద్రంలో నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడిగా అనంతారానికి చెందిన మల్కం వీరభద్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా పత్తిపాటి మోహన్‌రావు, కోశాధికారిగా రేపాల కోటేశ్వరరావు, ప్రధానకార్యదర్శిగా నేలాల నవీన్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పూర్ణచందర్‌రావు, తాటి అరుణ్, కొమ్ముగిరి కామేశ్వరరావు, వల్లమల సాంబయ్య, నల్లగట్ల జమలయ్య పాల్గొన్నారు.

కార్యాలయాల పంచాయితీ..!

నత్తనడకన జీపీ భవన నిర్మాణాల పనులు

- పక్కా భవనాలు లేక ఉద్యోగుల అవస్థలు
- అద్దెభవనాల్లో కార్యకలాపాలు..



నిర్మాణ దశలో ఉన్న కోయగూడెం పంచాయతీ కార్యాలయం

టేకులపల్లి: పాలనసౌలభ్యం కోసం ఏర్పాటు చేసుకున్న గ్రామ పంచాయతీలకు కార్యాలయాల భవనాలు లేక అవస్థలు తప్పడం లేదు. మండలంలో మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉండగా వీటిలో 12 పంచాయతీలకు ఇప్పటికే కార్యాలయ భవనాలు ఉండగా మిగిలిన ఒక్కో భవనానికి రూ.20 లక్షలు చొప్పున 24 పంచాయతీలకు గతేడాది నూతన భవనాలు మంజూరయ్యాయి. ఇందులో మూడు ఈజీఎస్ నిధులతో నిర్మిస్తుండగా, 21 భవనాలు ఐటీడీఏ ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మిస్తున్నారు. పలు చోట్ల నిర్మాణాలు పూర్తిదశలో ఉండగా, చంద్రుతండా, తొమ్మిదో మైలుతండా, బర్లగూడెం, చింతోనిచెలక, కొత్తతండా(జి) పంచాయతీల్లో పనులు ప్రారంభంకాకపోవడం శోచనీయం.

పూర్తి కాని భవనాలు ..

మండలంలో నూతనంగా మంజూరైన పంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణాల పరిస్థితిని పరిశీలిస్తే ప్రారంభం కానివి చంద్రుతండా, తొమ్మిదోమైలుతండా, బర్లగూడెం, చింతోనిచెలక, కొత్తతండా(జి), బేస్‌మెంట్ దశలో కోయగూడెం, గోల్యాతండా, రోళ్లపాడు, కుంటల్ల, రూఫ్ లెవెల్‌లో ఎర్రాయిగూడెం, కిష్టారం, పెట్రాంచెలక, రామచంద్రునిపేట, మేళ్లమడుగు, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్, స్లాబ్ పూర్తయినవి మొక్కంపాడు, మద్రాస్‌తండా, చుక్కాలబోడు, బిల్లుడుతండా, కొత్తతండా(పి), బేతంపూడి, ప్రెగళ్లపాడు, బద్దుతండా పంచాయతీలు ఉన్నాయి. తావుర్యాతండాలో మాత్రం ఆఘమేఘాలమీద పూర్తి చేసి ప్రహరీ లేకుండానే ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఇప్పటికైనా భవనాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని పంచాయతీల పాలకవర్గాలు, ప్రజలు కోరుకుంటున్నారు.

అద్దెభవనాల్లో..



కోయగూడెంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో పంచాయతీ కార్యాలయం..

భవన నిర్మాణాలకు నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు నిర్మాణ పనుల్లో ఆలస్యం చేస్తున్నారు. ఈ పాటికే నిర్మాణాలు పూర్తయి కార్యకలాపాలు కొనసాగాల్సి ఉండగా పాలకుల నిర్లక్ష్యం కారణంగా అద్దె భవనాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. పలు గ్రామాల్లో పాఠశాల భవనాల్లో, అంగన్‌వాడీ, ఆరోగ్య ఉపకేంద్రాల్లో పంచాయతీ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. దీంతో పాలకవర్గాలకు ఇబ్బందులు తప్పడం లేదు.

సెప్టెంబర్ కల్లా పూర్తి చేస్తాం

గతేడాది ఉపాధి హామీ పథకం కింద ఒక్కో భవనానికి రూ.20 లక్షలు చొప్పున కోయగూడెం, బద్దుతండా, ప్రెగళ్లపాడు పంచాయతీలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. మండలంలోని కోయగూడెంలో బేస్‌మెంట్‌లెవెల్‌లో ఉంది. బద్దుతండా, ప్రెగళ్లపాడు పంచాయతీల్లో చివరి దశలో ఉన్నాయి. మిగిలిన భవనాల మాణాలు సెప్టెంబర్ కల్లా పూర్తి చేస్తాం.

– నవీన్, పీఆర్ ఏఈ

కాంట్రాక్టర్లను ఆదేశించాం

ఐటీడీఏ పరిధిలో ఎస్టీఎస్‌డీఎఫ్ పథకం కింద ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షలు చొప్పున 21 పంచాయతీ భవనాలు గతేడాది మంజూరయ్యాయి. ఇందులో 3 బేస్‌మెంట్ లెవెల్‌లో, 6 రూఫ్ లెవెల్‌లో, 7 స్లాబ్ చివరి దశలో, 5 పనులు ప్రారంభం కాని దశలో ఉన్నాయి. ప్రస్తుతం నిధుల సమస్య ఉన్నా నిర్మాణాలు ఆపొద్దని త్వరిగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశిస్తున్నాం.

– సలార్, ఐటీడీఏ ఏఈ

న్యాయవాద రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలి



కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



ఇల్లెందులో..

కొత్తగూడెంటౌన్: సిద్దిపేట న్యాయవాది ఎం.రవికుమార్‌పై పోలీసుల దాడికి నిరసనగా గురువారం కొత్తగూడెం జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జిలు ధరించి, ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ.. న్యాయవాదులపై రోజు రోజుకు దాడులు పెరిగిపోతున్నాయని, తక్షణమే ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు గాజుల రామ్మూర్తి, మనుబోతుల సత్యనారాయణ, షేక్ మహ్మద్ ఖాసీం, బి.చిరంజీవరావు, సింగు ఉపేందర్, అరికెల రవికుమార్, రమేష్, లక్ష్మీ, సరిత, ఉమా, బి.రాజశేఖర్, యాస యుగేందర్ నాయుడు, శ్రీధర్, వేముల సుధాకర్, రామకృష్ణ, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: ఇల్లెందు కోర్టు వద్ద న్యాయవాదులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షులు బి. రవికుమార్ మాట్లాడుతూ... నిన్న భద్రాచలం, నేడు సిద్దిపేటలో మరో న్యాయవాది మీద అక్కడి ఏఎస్సై దుర్భాషలాడుతూ అతనిపై చేయి చేసుకున్నాడని తెలిపారు. రానున్న కాలంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. న్యాయవాదులు ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తీక్, ఎస్ మల్లిఖార్జున్‌రావు, నాగేశ్వరరావు, గోపీనాథ్, బాలకృష్ణ, మహేశ్వరరావు, దంతాల ఆనంద్, అనిల్, కలవల సుధాకర్, ఐలయ్య, నారాయణ, రబ్బానీ, కాసీం, ఉర్మిళ, సౌమ్య, ధనుంజయరావు, వినోద్ పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేసుకున్న గ్రామస్తులు



మరమ్మతు చేయిస్తున్న గ్రామస్తులు

జూలూరుపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామం నుంచి కొత్త పోడు భూముల వరకు ఉన్న రోడ్డును గురువారం గ్రామస్తులు, రైతులు కలిసి బాగు చేసుకున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా దారంతా బురదమయంగా మారతుండటంతో అంతా సమకూర్చుకున్న డబ్బుతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు.

ఇంజనీర్ల పాత్ర కీలకం

ఇల్లెందురూరల్: సమాజాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమైందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పోలారపు పద్మ అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలంగాణ ఇంజనీర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ బిందుశ్రీ, అధ్యాపకులు సరిత, కిరణ్‌కుమార్, శేఖర్, రాజు, ఇంద్రాణి, డాక్టర్ రమేష్, సురేందర్, ఈశ్వర్, శ్రీకాంత్, కుమార్, లక్ష్మణ్‌రావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మ

జనాభా నియంత్రణపై అవగాహన ఉండాలి



టేకులపల్లి: మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న పుల్లయ్య

టేకులపల్లి: జనాభా నియంత్రణపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మోకాళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మెడికల్ కాలేజీ విద్యార్థులతో కలిసి మండలంలోని కేజీబీవీ, టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించి అక్కడ అధిక జనాభా వల్ల దేశానికి జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. నియంత్రణ లేని జనాభా పెరుగుదల వల్ల అనుకున్న స్థాయిలో ప్రగతి సాధించలేకపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కందుల దినేష్, గవర్నమెంట్ హై స్కూల్ హెడ్మాస్టర్ శ్రీనివాస్, కస్తూర్బా ప్రిన్సిపల్ సంతు, డాక్టర్ భూపతి రెడ్డి, దేవకీదేవి, భద్రమ్మ, లక్ష్మీబాయి, కృష్ణవేణి, అమ్మని, మెడికోస్ అకహ్యా రెడ్డి, హిమాని ఫౌజుదర్, రవి శ్రేయాని, హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, సూపర్‌వైజర్ గుజ్జా విజయ, సిబ్బంది తరంగిణి, చంద్రకళ, లక్ష్మి పద్మ సక్కు నాగమణి సుజాత అరుణ పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: అధిక జనాభాతో వనరుల కొరత ఏర్పడుతుందని, ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ ప్రాముఖ్యతను తెలుసుకోవాలని కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగాసింగరేణి మహిళా డిగ్రీ కళాశాల వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.శారద, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీఓలు జి.సునిత, కె.ఆశాజ్యోతి, ఆర్.కృష్ణవేణి, ఏఎస్‌వో, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు న్యాయవాదులకు హెల్త్ కార్డుల పంపిణీ

కొత్తగూడెంటౌన్: న్యాయవాదులకు హెల్త్ కార్డులను శుక్రవారం పంపిణీ చేస్తామని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అన్నారు. గురువారం కొత్తగూడెం జిల్లా కోర్టులోని లైబ్రరీ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ హెల్త్‌కార్డులపై రూ.2 లక్షల వరకు ఉపయోగం ఉంటుందని, డెంటల్, డెలివరీ, కాస్మోటిక్స్‌కు హెల్త్‌కు వినియోగించుకోవచ్చన్నారు. హెల్త్‌కార్డులను రూ.2 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తోట మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఆర్ రవిచంద్ర, సాదిక్‌పాషా, డి.రవికుమార్, ఎస్.ప్రవీణ్‌కుమార్, మహిళా రిప్రెజెంటివ్ ఎన్.ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

సీఏలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని



దివ్యను సన్మానిస్తున్న కాలేజీ యాజమాన్యం

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిలర్ వై.శ్రీనివాస్‌రెడ్డి కుమార్తె దివ్యారెడ్డి సీఏ ఉత్తీర్ణత సాధించింది. ఆమె కొత్తగూడెం సూర్యోదయ స్కూల్‌లో పదో తరగతి వరకు, ఇంటర్ నలంద కాలేజీలో చదివి ప్రతిభ కనబర్చగా ఇప్పుడు సీఏ ఫలితాల్లోనూ సత్తా చాటింది. ఈ సందర్భంగా దివ్యను నలంద వివేకవర్ధిని కళాశాల చైర్మన్ ఎం.వీ.చౌదరి, అధ్యాపకులు గురువారం అభినందించారు.

పింఛన్ పెంచాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు కనీస పింఛన్ రూ.10 వేలకు పెంచాలని సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు లట్టి జగన్మోహన్ రావు డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెంలోని బీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సీపీఆర్ఎంఎస్ కార్డ్ కలిగిన వారికి కార్పొరేట్ వైద్యశాలలో వైద్యం చేయించుకునే సమయంలో పేషంట్‌తో బిల్లులు కట్టించుకుంటున్నారన్నారు. దీని వలన కార్మికుడు రెండు విధాల నష్టపోతున్నారని, ఈ సమస్యపై చర్చించాలన్నారు. టీవీ సూరి, సంగం చందర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కొత్తగూడెంఅర్బన్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని 25వ వార్డు కౌన్సిలర్ సాహెరబేగం అన్నారు. గురువారం వార్డులో డ్రెయినేజీల వద్ద బ్లీచింగ్‌ను చల్లించారు. ఇళ్లలో నీటిని నిల్వ ఉంచకుండా, తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనానికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చిరంజీవి, సులోచన, మున్సిపల్ జవాను నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు

- జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్

సాక్షి ఎఫెక్ట్..



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ

ఇల్లెందురూరల్: గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ స్పష్టం చేశారు. 'పారిశుధ్యం అధ్వానం' శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు గురువారం ఉదయమే మండలంలోని మస్సివాగు, ముత్తారపుకట్ట, మాణిక్యారం, బోయితండా గ్రామాల్లో పారిశుధ్య పనులు పరిశీలించారు. వీధులు, తాగునీటి పథకాల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఉండటంతో తొలగింపు పనులు చేపట్టాలని ఆదేశించారు. అన్ని వీధుల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయాలని, వర్షాకాలంలో దోమల ఉధృతికి అవకాశం ఉన్నందున నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, మురుగు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి బ్లీచింగ్ చల్లాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ప్రతీ ఇంటికి మొక్కలు పంపిణీ చేయడం, పాఠశాలల్లో కిచెన్ పార్క్, ఖాళీ ప్రదేశాలు, ఎవెన్యూ ప్లాంటేషన్‌లలో మొక్కలు నాటడం వంటి పనులు చేయాలని సూచించారు. ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో రమణ, ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శులు రాధిక, రజియా, రాజు, రజనీకాంత్ ఉన్నారు.

అసంపూర్తి పనులపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే కోరం కనకయ్య
- మున్సిపల్ చైర్మన్, అధికారులతో కలిసి పరిశీలన



మల్టీ యుటిలిటీ సెంటర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, చైర్మన్ డీవీ, అధికారులు

ఇల్లెందు: ఏడాది కాలంగా అసంపూర్తిగా ఉన్న పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం ఆయన పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా రూ.4కోట్లతో చేపట్టిన బుగ్గవాగు ప్రక్షాళన పనులు, రూ.25లక్షలతో నిర్మిస్తున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్, రూ.కోటితో నిర్మించే సిమ్మింగ్ పూల్, మోడల్ మార్కెట్, మల్టీయుటీలిటీ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను పరిశీలించి వివరాలు ఆరా తీశారు. అలాగే, ప్రభుత్వాస్పత్రి ఎదురుగా కాకతీయ నగర్‌లో ఖాళీగా ఉన్న స్థలాన్ని పరిశీలించి స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఇతర పనులను పరిశీలించి త్వరగా పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

అడ్డుకుంటే రద్దు చేస్తాం..

గోవింద్ సెంటర్ నుంచి సత్యనారాయణపురం వెళ్లే రహదారి పనులను అడ్డుకుంటే రద్దు చేస్తామని ఎమ్మెల్యే కనకయ్య తెలిపారు. పట్టణంలోని గిరిజన్ భవన్‌ను పరిశీలిస్తున్న సమయాన బస్తీవాసులు చేరుకుని రోడ్డు ప్రస్తావన తీసుకొచ్చారు. ఈ రోడ్డు స్థానికులకే అవసరమని, ఒకవేళ వద్దనుకుంటే రద్దీ చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. దీంతో వారు రోడ్డు అవసరమేనని చెప్పగా ఎక్కువ నష్టం జరగకుండా చూస్తామని కనకయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కటకం పద్మావతి, పత్తి స్వప్న, సందా బిందు, అంకెపాక నవీన్, వాంకుడోతు తారా, కుమ్మరి రవీందర్, సయ్యద్ ఆజమ్, పీఆర్ ఈఈ శ్రీనివాస్‌రావు, డీఈ రాంకిషన్, ఏఈ రాజు, నాయకులు మడుగు సాంబమూర్తి, చిట్టిబాబు, కమల్ కోరీ, జాఫర్, బోళ్ల సూర్యం తదితరులు ఉన్నారు. కాగా, పట్టణంలోని ప్రధాన రహదారుల్లో చేపట్టిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో భాగంగా డ్రెయిన్ వరకు సీసీ నిర్మించామని.. వ్యాపారులు రోడ్లపై సరుకులు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, జవాన్లు అంజాద్, ప్రకాష్, కళ్యాణ్, లక్ష్మణ్‌లు ఉన్నారు.

సీతారామ ప్రాజెక్ట్ నీరు అందించాలి



సమావేశంలో అఖిలపక్షం నాయకులు

జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ గోదావరి జలాలను జూలూరుపాడు మండలానికి అందించాలని అఖిలపక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీ నాయకులు, రైతులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గోదావరి జలాలను ఏన్కూరు సాగర్ కెనాల్‌కు మళ్లించేందుకు వినోభానగర్ నుంచి లింకు కెనాల్ నిర్మాణం చేపట్టారని, ఇది మండల రైతాంగానికి తీరని నష్టాన్ని కలిగిస్తుందన్నారు. ఏన్కూరు లింక్ కెనాల్ పనులను తక్షణమే నిలిపివేసి మండలానికి మళ్లించి డిస్ట్రిబ్యూషన్ కాలువల ద్వారా చెరువులను నింపి సాగు భూములకు నీరు అందించాలని కోరారు. నాయకులు జాటోత్ కృష్ణ, అరెం రామయ్య, బానోత్ ధర్మా, జూలూరుపాడు సహకార సంఘం అధ్యక్షుడు చీమలపాటి భిక్షం, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యాసా నరేష్, వై గోపాల్ రావు, మూడ్ చిట్టిబాబు, రమేష్, నరసింహారావు, సిద్ధు, సొసైటీ డైరెక్టర్ తిరువెంగళరాజు, రోశయ్య, శ్రీను, వెంకటమ్మ, నరేష్, సత్యనారాయణరాజు, వెంకటేశ్వర్లు, వీరభద్రం, జవహర్‌లాల్ ఉన్నారు.

ప్రమోషన్లతో కూడిన బదిలీలపై హర్షం

ఇల్లెందు: గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు ప్రమోషన్లతో కూడిన బదిలీ షెడ్యూల్ విడుదల చేయటంపై తెలంగాణ గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయ సంఘం హర్షం వ్యక్తం చేసింది. గురువారం హైదరాబాద్‌లో ట్రైబల్ కమిషనర్, ప్రభుత్వ కార్యదర్శిని కలిసి కృతజ్ఞతలు తెలిపినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు ప్రతాప్ సింగ్ తెలిపారు. పదోన్నతులు, బదిలీలు 11 ఏళ్లుగా నోచుకోని ఉపాధ్యాయులకు జీఓ విడుదల చేయటం ఊపిరి పోసినట్లు అయ్యిందన్నారు. ప్రతాప్ సింగ్, రాంబాబు, హరినాథ్ తదితరులు ఉన్నారు.

సీఎండీకి వినతి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిటింగ్ పూర్తయిన నేపథ్యంలో కార్మికులకు చెల్లించే ప్రాఫిట్ షేరింగ్ బోనస్ 38 శాతం చెల్లించాలని గురువారం సింగరేణి సీఎండీకి హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ వినతిపత్రాన్ని ఫ్యాక్స్ ద్వారా పంపినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

రెంట్ కటింగ్ నిలిపివేయాలని జీఎంకు..

కొత్తగూడెం ఏరియాలో డబుల్ క్వార్టర్స్ ఉన్న కార్మికుల నుండి పీనల్ రెంట్ కటింగ్‌ను నిలిపివేయాలని ఏరియా జీఎం ఎం శాలేంరాజును ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్ కోరారు. ఈ మేరకు గురువారం జీఎం చాంబర్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజాక్ మట్లాడుతూ... క్వార్టర్స్ మరమ్మతుకు 6 నుంచి 9 నెలలు పట్టే అవకాశం ఉన్నందున యాజమాన్యం సుమారు 72 మంది నుంచి మరమ్మతు అయ్యేంత వరకు పీనల్ రెంట్ నిలిపివేయాలని కోరారు.

శ్రావణపల్లి బ్లాక్ సింగరేణికి కేటాయించాలి



సింగరేణి(కొత్తగూడెం): నిరసన దీక్ష చేపట్టిన ఏఐటీయూసీ నాయకులు

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను కార్పొరేట్ కంపెనీలకు వేలం వేయకుండా, తెలంగాణ నుంచి శ్రావణపల్లి బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరటి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇల్లెందు జీఎం కార్యాలయం ఎదుట సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ చేపట్టిన దీక్షలు గురువారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్షణం వేలం పాటలను రద్దు చేసి సింగరేణికి కేటాయించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు జమలయ్య, శ్రీనివాస్, దాసరి రాజారామ్, గడదాసు నాగేశ్వరరావు, బంధం నాగయ్య, పైడిరాజు, మసూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఉద్యమానికి సిద్ధంగా ఉండాలి

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం బొగ్గుబ్లాకుల వేలం విషయంలో దోబూచులాడుతుందని ఇందుకు వ్యతిరేకంగా సింగరేణి కార్మికులు ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని ఏఐటీయూసీ నాయకులు, యూనియన్ అడ్వయిజర్ దమ్మాలాపాటి శేషయ్య పిలుపునిచ్చారు. సింగరేణి బొగ్గుబ్లాకుల వేలానికి నిరసనగా సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వంగా వెంకట్, జి. వీరస్వామి, నాయకులు గట్టయ్య, ఎస్‌వి రమణమూర్తి, క్రిష్టాఫర్, సందెబోయిన శ్రీనివాస్, సావటి స్వామి, సురేందర్, చంద్రయ్య పాల్గొన్నారు.

టేకులపల్లి: బొగ్గ గనుల ప్రైవేటీకరణ, వేలం ప్రక్రియను నిలిపివేయాలని సీపీఐ మండల కార్యదర్శి గుగులోత్ రాంచందర్ నాయక్ ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బొగ్గ బ్లాకుల ప్రైవేటీకరణ నిర్ణయం తెలంగాణలోని సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే కుట్రలో భాగమేనన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్ దుర్గారాంప్రసాద్ -9000327175 | టోల్‌ఫ్రీ నెం.:1800 270 1083

సాక్షి – పాఠక మహాశయులకు విజ్ఞప్తి – Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండంత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183